క్లుప్తంగా

శేషపాన్పుపై జగన్నాథ స్వామి దర్శనం



విజయనగరం టౌన్: స్థానిక కోళ్లబజారులో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి శేషపాన్పుపై శుక్రవారం దర్శనమిచ్చారు. స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు..శేషపాన్పుపై పవళిస్తున్న స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

జగన్నాథస్వామికి రామతీర్థం పట్టువస్త్రాలు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: విశాఖపట్నం టర్నర్ చౌల్ట్రీలో కొలువైన జగన్నాథస్వామికి రామతీర్థం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. రథయాత్ర పురస్కరించుకుని, స్వామి వారి దశావతారాల్లో భాగంగా శుక్రవారం రామావతారంలో స్వామిని అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

జెడ్పీ సమావేశం దృష్టికి భోగాపురం సమస్యలు



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూషరెడ్డి

భోగాపురం: విజయనగరం జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశం దృష్టికి భోగాపురం సమస్యలను ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి తీసుకువెళ్లారు. కవులవాడ నుంచి తూడెం పంచాయతీలోని గ్రామాలకు వెళ్లే రహదారి విమానాశ్రయంలో కలసిపోయిందని, దీంతో ఆ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదని తెలిపారు. అలాగే ఆయా గ్రామాలకు సీసీ రోడ్డు స్థానంలో తారురోడ్డు నిర్మించాలని కోరారు. ఆమె లేవనెత్తిన సమస్యలపై స్పందించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు..ఆయా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు చెప్పారు.


20 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణాను అరికట్టడమే లక్ష్యంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో గంజాయితో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఇలా పట్టుబడిన నిందితుల్లో ఇద్దరు మహిళలు ఉండడం విశేషం. రాయగడ–గుంటూరు రైలులో పవన్, వీరంజిని, సుదర్శన్‌లను..కోర్బా–విశాఖపట్నం రైలులో రాజస్థాన్‌కు చెందిన బాలసోని, ఢిల్లీకి చెందిన ప్రియలను పట్టుకున్నామని జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ తెలిపారు. నిందితుల దగ్గర నుంచి మొత్తం 20 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

పారదర్శకంగా సోషల్ ఆడిట్ చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధిక

పూసపాటిరేగ: పారదర్శకంగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎంపీడీవో ఎం.రాధిక సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల వారీగా జరిగిన ఉపాధి హామీ పథకం పనులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రికార్డుల ప్రాప్తికి పనులు జరిగినదీ లేనిదీ తనిఖీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరిగిన తనిఖీలలో ఎటువంటి తప్పిదాలు బయటపడిన సంబంధిత ఉద్యోగులపై చర్యలుటాయన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు రత్నమాల, తిరుపతిరావు పాల్గొన్నారు.

రైళ్లల్లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం క్రైమ్: గంజాయి రవాణా నిర్మూలనే లక్ష్యంగా స్థానిక రైల్వేస్టేషన్‌లోని పలు రైళ్లల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈగల్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ జవానులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో గంజాయి రవాణా జరుగుతున్నదీ లేనిదీ సోదాలు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం



విజయనగరం అర్బన్: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ సేతుమాధవన్, తదితరులు

మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గిరిజన సంఘాల నేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, సీతారామరాజు చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. 24 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్య సాధనకు బ్రిటిష్ వారికి ఎదురుతిరిగిన గొప్ప పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు అని, ఆయన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతిఒక్కరూ మహోన్నతుల జీవిత చరిత్రను తెలుసుకుని, వారిలా ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. –విజయనగరం అర్బన్, భోగాపురం, నెల్లిమర్ల రూరల్



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో అల్లూరికి జోహార్లు చెబుతున్న సీపీఐ నాయకులు, తదితరులు



భోగాపురం: చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తదితరులు

జూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

నెల్లిమర్ల: స్థానిక జూట్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి బి.గీత తెలిపారు. మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో జూట్‌మిల్లు కార్మికుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారు.. మిల్లు యాజమాన్యం కార్మిక చట్టాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. వేలాది మంది రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ బకాయిలు చెల్లించలేదన్నారు. పీఎఫ్ బకాయిలు సంస్థకు చెల్లించకపోవడంతో కార్మికులు పెన్షన్లు అందుకోలేని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కార్మికుల వద్ద నుంచి అప్పుగా తీసుకున్న మొత్తాలను కూడా తిరిగి చెల్లించలేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించడం జరుగుతోందన్నారు. అనంతరం ఇదే సమావేశంలో జూట్‌మిల్లు కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నామాల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా మద్దిల అప్పలనాయుడు ఎన్నికయ్యారు.

ప్రజా సహకారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ




పారిశుధ్యంపై ప్రజలకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: ప్రజల సహకారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందని జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొండగుంపాం గ్రామంలో చేస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణపై ఆరాతీశారు. కాలువలను ఎవరూ ఆక్రమించవద్దని, ఒకవేళ అవి ఆక్రమణకు గురైతే పారిశుధ్య పనులు కష్టమవుతాయని తద్వారా రోగాలు ప్రబలుతాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని తెలిపారు. ప్రతిఒక్కరూ ఇంటి ముంగిటకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు చెత్తను అందివ్వాలన్నారు. అలాగే తాగునీటి ట్యాంకుల్లో నీటి నాణ్యత పరీక్షలు చేయాలని, క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలని సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ పతివాడ అప్పన్న, ఎంపీడీవో రామకృష్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో శంక జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సూర్యావతి వర్ధంతి

విజయనగరం గంటస్తంభం: మహిళా ఉద్యమ నేత, ప్రముఖ కమ్యూనిస్టు మానికొండ సూర్యావతి వర్ధంతి నగరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు కృష్ణమ్మ తదితరులు సూర్యావతి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మహిళా హక్కులు–వాటి సంరక్షణ కోసం సూర్యావతి చేసిన పోరాటాలను వక్తలు కొనియాడారు.

నిర్దేశిత జోన్లలోనే విక్రయాలు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో నిర్దేశించిన జోన్లలోనే వీధి విక్రయాలు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఆయన స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో తోపుడుబండ్ల వ్యాపారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. నగర క్రమబద్ధీకరణలో భాగంగా ఈ నూతన విధానాలు అవలంబిస్తున్నామని, అందరూ నిబంధనలు పాటించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. నగరంలోని ప్రాంతాలను రెడ్, అంబర్, గ్రీన్ జోన్లుగా విభజించామన్నారు. ఆయా జోన్లలో ఒక్క గ్రీన్‌జోన్‌లో మాత్రమే నిత్యం విక్రయాలు చేసుకునేందుకు వీలుందని, మిగతా జోన్లలో నిర్దేశిత సమయంలోనే వ్యాపారాలు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు, టీపీఆర్వో సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి

విజయనగరం: సచివాలయ సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఇటీవల చేపట్టిన బదిలీల ప్రక్రియలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బదిలీ అయిన సచివాలయ సిబ్బందికి బదిలీల ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మనం అందిస్తున్న సేవలే మనకు మంచి గుర్తింపునిస్తాయని, ప్రతిఒక్కరూ చక్కగా పనిచేసుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

విజయనగరం గంటస్తంభం: కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహనరావు, బి.రమణలు కోరారు. నగరంలోని కోట జంక్షన్ వద్ద సమ్మెకు సంబంధించిన కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన కార్మికుల చట్టాలను కాదని, కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకువస్తుండడం దుర్మార్గమన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థలను పెట్టుబడిదారులకు అప్పగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఆ దిశగా మోదీ సర్కారు చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇప్పటికైనా కార్మిక హక్కుల సంరక్షణ కోసం పోరాటం చేయకుంటే మరింత నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో రాజు, రామానాయుడు, రమణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం..

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జగనన్న కాలనీలో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. ఇటీవల జగనన్న కాలనీల్లో ప్రగతి పనులపై నిర్లక్ష్యం పేరిట ఇటీవల సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు..రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి బబిత ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. అన్ని జిల్లాల్లో నెలకొన్న న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి 20 లోక్‌అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె వెల్లడించారు. రాజీ అవ్వాలనుకుంటున్న క్రిమినల్ కేసులు సహా ప్రమాద బీమా, బ్యాంకు, చెక్కుబౌన్స్, ప్రామిసరీ నోట్, ఎక్సైజ్, భూ తగాదా, కుటుంబ తగాదా, నీరు, ప్రీలిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పెంపుడు కుక్కలకు ర్యాబిస్ టీకాలు రేపు

విజయనగరం ఫోర్ట్: నగరంలోని బహుళార్థ పశువైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు శనివారం ర్యాబిస్ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ వైవీ రమణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఉదయం 8 గంటల నుంచే వ్యాక్సినేషన్ ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్య కేంద్రాల్లో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నైపుణ్యాధారిత వైద్య విద్యను బోధించాలి

విజయనగరం ఫోర్ట్: వైద్య విద్యార్థులకు నైపుణ్యాధారిత వైద్య విద్యను బోధించాలని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల సూచించారు. స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్య రంగంలో వస్తున్న అధునాత పద్ధతులను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈయూ కో–ఆర్డినేటర్ పీఏ రమణ, వైస్ ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేత

విజయనగరం టౌన్: స్థానిక కణపాకలోని లవింగ్ షఫార్డ్ అర్బన్ హోమ్‌లోని చిన్నారులకు ఏబీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ స్వరూప్‌కుమార్, షాలినీలు పుస్తకాలు, పెన్సిళ్లు, కేకు, స్వీట్లు, ఆహారం శుక్రవారం అందజేశారు. నిరుపేద చిన్నారులకు తమవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందని దాతలు తెలిపారు.

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలతో పోలీసులు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురంలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తి నుంచి 16 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా, అనధికారికంగా మద్యం కలిగి ఉన్నా, పరిమితికి మించి మద్యంబాటిళ్లు రవాణా చేసినా సమాచారం ఇవ్వాలని, సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి తరలించాలి



విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించాలని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఇదే విషయమై సర్వజన ఆస్పత్రి ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సరిపడ మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గాజులరేగలో 70 ఎకరాల విస్తీర్ణంలో వైద్య కళాశాల నిర్మించారని, అక్కడే క్రిటికల్ కేర్ నిర్మాణం కూడా జరుగుతోందని, 750 బెడ్లు కలిగిన ఆస్పత్రి భవనం కూడా ఉందన్నారు. ఈ నేపథ్యంలో సర్వజన ఆస్పత్రిని ప్రభుత్వ వైద్య కళాశాలకు మారిస్తే రోగులకు సరిపడ అన్ని సదుపాయాలు ఒక్కచోటే లభ్యమైనట్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు. –విజయనగరం ఫోర్ట్

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన వీరంతా విజయనగరం ఆర్టీసీ డిపో ఎదుట నిలబడి తమ సమస్యల పరిష్కారంపై గళంవిప్పారు. పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ నియమించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ మొత్తాలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.భానుమూర్తి, డిపో కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి సీహెచ్ పి.పట్నాయక్, డీవీఆర్ఎస్ నారాయణ, కేవీ రమణ, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు. –విజయనగరం అర్బన్

సంతోషిమాతకు పుష్పాభిషేకం



విజయనగరం జిల్లా కేంద్రంలోని మయూరి కూడలిలో ఉన్న సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు అయిన శనివారం అమ్మవారికి వివిధ పుష్పాలతో అభిషేకం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేకాలంకరణలో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

–సాక్షి రిపోర్టర్, విజయనగరం

ట్రిపుల్ ఐటీకి గురుకుల విద్యార్థులు



వి.వెంకటేష్



జి.హెప్సిబా ఇవాంజలిన్



పి.జనార్ధన్‌సాయి



ఆర్.రాహుల్



ఎస్.వరుణ్‌కుమార్



కె.యశ్వంత్

విజయనగరం అర్బన్: ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఉమ్మడి విజయనగరం జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపావతి శుక్రవారం తెలిపారు. సీట్లు సాధించిన వారిలో బాడంగి గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్.వరుణ్‌కుమార్(శ్రీకాకుళం క్యాంపస్), పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు గురుకుల పాఠశాల నుంచి పి.జనార్ధన్‌సాయి, కె.యశ్వంత్(నూజివీడు క్యాంపస్), ఆర్.రాహుల్(ఇడుపులపాయ క్యాంపస్), కొమరాడ గురుకుల పాఠశాల నుంచి జి.హెప్సిబా ఇవాంజలిన్(శ్రీకాకుళం క్యాంపస్) ఉన్నారన్నారు. ఈ మేరకు సదరు విద్యార్థులకు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి



పంచాయతీ అధికారులకు సూచనలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి శిరీషారాణి

డెంకాడ: మండలంలోని చింతలవలసలో డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలించడంతో పాటు శ్రీవిజయ ఫుడ్‌కోర్టు, ఇతర రెస్టారెంట్‌లను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్లేట్లను వేడినీళ్లతో కడగాలని, కస్టమర్లు తాగడానికి వేడినీరు సదుపాయం కల్పించాలని, ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా చూడాలని ఆహార విక్రయ కేంద్రాల యాజమాన్యానికి సూచించారు. అలాగే నాడెప్ పిట్లు నిర్మించి, చెత్త సంపద తయారీ కేంద్రం బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులు, ఎస్‌డబ్ల్యూపీసీ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు వినియోగించుకోవాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



నిర్వాహకుల నుంచి జ్ఞాపిక అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఎనస్థీషియాకు సంబంధించి, నూతన ఆవిష్కరణలను వైద్యులు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, ఎనస్థీషియా వైద్య నిపుణులు డాక్టర్ డీవీజీ శంకరరావు కోరారు. ఐఎస్‌ఏ రాష్ట్ర సంఘం 34వ వార్షికోత్సవం పురస్కరించుకుని, విశాఖలో జరుగుతున్న దక్షిణ భారతదేశ స్థాయి వైద్యుల సదస్సులో ఓ సెషన్‌కు శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగానికి సంబంధించిన అన్ని విభాగాలలో ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు వస్తూనే ఉన్నాయని, ఇప్పుడు ఎనస్థీషియా విభాగానికి సంబంధించి వస్తున్న మార్పులను వినియోగించుకుని శస్త్ర చికిత్స సమయంలో రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడవచ్చన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సదదస్సులో ఏడు రాష్ట్రాల నుంచి 1,500 మంది మత్తు వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. అనంతరం నిర్వాహకులు శంకరరావుకు జ్ఞాపిక అందజేసి, సన్మానించారు.